క్లుప్తంగా

దోమల నివారణకు చర్యలు

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో దోమల నివారణకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. దానిలో భాగంగా బుధవారం నులకపేటలోని మసీదు సెంటర్, క్వారీ గుంతలు, మెయిన్‌రోడ్ ప్రాంతాల్లో కార్పొరేషన్ శానిటేషన్ సిబ్బంది ఫాగింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పలు ప్రాంతాల్లో డ్రైనేజీలను శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లారు. వర్షపునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ ఏర్పాటు చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మైక్ ద్వారా ప్రచారం చేస్తూ మరోపక్క ఫాగింగ్ చేపట్టారు.

పోలీసు అమరవీరుల సంస్మరణ సభకు ఆహ్వానం



తాడేపల్లిరూరల్: వీరమరణం పొందిన పోలీసు కుటుంబాన్ని పోలీసు అమరవీరుల సంస్మరణ సభకు రావాలని కోరుతూ కాకినాడ మూడో బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ జేఎస్‌వీ సత్యనారాయణ ఆహ్వానం పలికారు. మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లికి చెందిన వి.శంకరరావు, కాకినాడ మూడో బెటాలియన్‌లో ఏపీఎస్‌పీ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో ఉండగా 1992లో నక్సలైట్లు పేల్చిన బాంబుదాడిలో శంకరరావు ప్రాణాలు కోల్పోయాడు. ఈనెల 21వ తేదీన పోలీసు అమరవీరుల దినోత్సవం నేపథ్యంలో కాకినాడ ఏపిఎస్‌పి 3వ బెటాలియన్ కమాండెంట్ సీహెచ్ విజయరావు ఆదేశాల మేరకు బుధవారం బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ సత్యనారాయణ తాడేపల్లి చేరుకుని వీరమరణం పొందిన శంకరరావు భార్యకు పండ్లు, పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానం పలికారు.

కార్పొరేషన్ సెక్యూరిటీ గార్డుపై న్యాయ విద్యార్థిని ఫిర్యాదు

మంగళగిరి: నగరపాలక సంస్థ సెక్యూరిటీ గార్డు అసభ్యంగా ప్రవర్తించడమే కాక అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు న్యాయ విద్యార్థిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు.. తెనాలి గంగానమ్మపేటకు చెందిన న్యాయ విద్యార్థిని ఎం.దివ్యశ్రీ, డెత్ సర్టిఫికెట్ నకలు కొరకు కార్పొరేషన్‌కు బుధవారం రాగా సెక్యూరిటీ గార్డు కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకోవడంతో పాటు అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రాంగణ ఎంపికలలో చలపతి విద్యార్థుల ప్రతిభ

మోతడక(తాడికొండ): తాడికొండ మండలం మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో 82 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కిరణ్ కుమార్ తెలిపారు. టెఫోలాజికల్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో ఐదుగురు విద్యార్థులు వార్షిక వేతనం రూ.8.5 లక్షలకు, వెస్లీ సాఫ్ట్ టెక్నాలజీస్‌లో ఇద్దరు విద్యార్థులు వార్షిక వేతనం రూ.4 లక్షలు, సదర్లాండ్ గ్లోబల్ సర్వీసెస్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించినఎంపికలకు 75 మంది, వార్షిక వేతనం రూ.3 లక్షలు ఇచ్చేలా ఉద్యోగాలకు ఎంపికవడం గర్వకారణమన్నారు. కళాశాలలో చదువుతో పాటు ప్రణాళిక ప్రకారం ఉపాధి శిక్షణ మరియు వ్యక్తిత్వ శిక్షణ తరగతులు నిర్వహించడం ద్వారా విద్యార్థులు ఉన్నతంగా రాణిస్తున్నారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు, కార్యదర్శి వై.సుజిత్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు, ఉపాధి కల్పనాధికారి ఎ.ధర్మరాజు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

మంగళగిరి: నగర పరిధిలోని తెనాలి రోడ్డులో ఐదు క్వింటాలు రేషన్ బియ్యాన్ని బుధవారం స్వాధీనం చేసుకున్నారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. తెనాలి రోడ్డులో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని ఆటోతో పాటు డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

16 బస్తాలు..

నగర పరిధిలోని తెనాలి రోడ్డులో అక్రమంగా ఆటోలో తరలిస్తున్న 16 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. బుధవారం రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. కృష్ణా జిల్లా కంకిపాడుకు చెందిన ఉప్పుతల నాగేశ్వరరావు ఇంటింటికి తిరిగి రేషన్ బియ్యం కొనుగోలు చేసి కోళ్ల ఫారాల నిర్వాహకులకు విక్రయిస్తుంటాడు. కొనుగోలు చేసిన బియ్యాన్ని ఆటోలో తెనాలికి తరలిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు తనిఖీలు నిర్వహించి బియ్యాన్ని ఆటోను నాగేశ్వరరావును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేశారు.

అధిక లోడుతో వెళుతున్న లారీకి జరిమానా

తెనాలిరూరల్: అధిక లోడుతో వెళుతున్న లారీకి అధికారులు జరిమానా విధించారు. కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం వద్ద అధిక ఇసుక లోడుతో వెళుతున్న లారీని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది బుధవారం గుర్తించారు. లారీ యజమానికి రూ. 10 వేలు జరిమానా విధించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా



పేరేచర్లలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో కిట్లు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా

మేడికొండూరు: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా పేర్కొన్నారు. మండల పరిధిలోని పేరేచర్లలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా వైద్య శిబిరంలో ఏఏ రకాల మందులు ప్రజలకు అందిస్తున్నారో తెలుసుకున్నారు. ఎలాంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు.. ఎన్నిరోజులకు సరిపడా మందులు అందిస్తున్నారని ఆరా తీశారు. ఎంత మంది పరీక్షలు చేయించుకున్నారనే విషయాలు తెలుసుకున్నారు. ప్రజలకు వైద్య సౌకర్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్దయ్య, ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, సొసైటీ చైర్మన్ షేక్ గాలిబ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బాజీ, తహసీల్దారు శ్రీనివాసశర్మ, ఎంపీడీఓ ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శి రహమాన్ పాల్గొన్నారు.

ప్రజల చెంతకు వైద్యసేవలు

ఫిరంగిపురం: ప్రజలచెంతకు జగనన్న ఆరోగ్యసురక్ష ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడులో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం ఫిరంగిపురం పీహెచ్‌సీ సెక్టారు పరిధిలో నిర్వహించారు. సర్పంచి ఎం.విజయలక్ష్మి మాట్లాడారు. తక్కెళ్లపాడు అనుబంధ గ్రామాలైన గరుడాచలపాలెం, శిరంగిపాలెం గ్రామాల్లో మొత్తం 1151 గృహాలు ఉండగా 4,803 జనాభా ఉన్నారని శిబిరానికి 393 మంది హాజరుకాగా వారికి వైద్యపరీక్షలు చేసి మందులు అందజేసినట్లు ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యురాలు పి.ఎస్తేరురాణి తెలిపారు. 130 మందికి వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు కంటి వైద్యనిపుణురాలు రోజారాణి తెలిపారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషక పదార్థాలు తీసుకోవడం ద్వారా కలిగే ఉపయోగాలు గురించి అంగన్‌వాడీలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.అనూరాధ, ఎం.ఈశ్వరరెడ్డి, ఇ.శ్రీనివాసరెడ్డి, సీహెచ్ శాంతమ్మ, కార్యదర్శి వెంకట్రావు, పీహెచ్‌సీ వైద్యులు యానీగ్రేస్, మేఘన, భీమేష్‌నాయక్, సీహెచ్‌ఓ వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, కె.సుదర్శనరాజు, బాబూరావు, విజయకుమార్, గణేష్‌భార్గవ్, ఎంఎల్‌హెచ్‌పీలు గోవర్ధన, స్వప్న, స్పందన, సాగర్‌రాణి, సువర్ణ, అనూష, ఏఎన్‌ఎంలు బారతీజ్యోతి, మాబు, అరుణ, ఆంతోనిరాణి, వెలాంగిణిరాణి, లావణ్య, సరోజ పాల్గొన్నారు.

దుగ్గిరాల మండలంలో..

తాడేపల్లిరూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల ఆరోగ్యమే లక్ష్యంగా పనిచేస్తోందని ఆ దిశగానే జగనన్న ఆరోగ్య సురక్ష ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందిస్తున్నారని దుగ్గిరాల ఎంపీపీ డి.సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.అరుణ అన్నారు. బుధవారం దుగ్గిరాల మండల పరిధిలోని పెదపాలెం, చినపాలెం గ్రామాలకు సంబంధించి దుగ్గిరాల ఈమని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పెదపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించి నూతన వస్త్రాలను అందజేశారు. జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమంలో వైద్యం చేయించుకున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు ఎస్.రత్నం, పెదపాలెం సర్పంచి పాటిబండ్ల కృష్ణప్రసాద్, వైద్యులు ప్రభాకర్ శివ, ఇందిర, కె.తాజుద్దీన్, సుకన్య, వీవీ కర్ల, వైఎస్సార్ సీపీ నాయకులు డి.వెంకటేశ్వరరావు, ఎ.నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, టి.వెంకట నారాయణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం..

మంగళగిరి: ఆరోగ్య ఆంధ్ర ప్రదేశే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కొనసాగుతోందని నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరాజు అన్నారు. బుధవారం నగరంలోని కొప్పురావుకాలనీ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిని ప్రతి కుటుంబాన్ని జల్లెడ పట్టి ఇంటి గడప వద్దనే ప్రజల ఆరోగ్య సమస్యలను క్షేత్ర స్థాయిలో గుర్తించి ప్రజలకు ఒక్క రూపాయి భారం లేకుండా నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షపై రోగులు సంతోషంగా వైద్య సేవలందుకుంటున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ప్రతి ఒక్కరికి వైద్య సేవలందించే లక్ష్యంగా కొనసాగుతుండగా జగనన్న ఆరోగ్య సురక్షలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి వార్డు గ్రామ, వార్డు స్థాయిలో ఇళ్ల వద్దనే వైద్య పరీక్షలు నిర్వహించడంతో ఉచితంగా మందులు చేయడం గతంలో ఎన్నడూ జరగలేదని జగనన్న ఆరోగ్య రక్ష అనేది వైద్య సేవలందించడంలో ఓ బృహత్తర కార్యక్రమమన్నారు. ఆరోగ్య సురక్షకు అపూర్వ ఆదరణ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మలేరియా డాక్టర్ శ్రీమన్నారాయణ, డాక్టర్ సత్యవతి పాల్గొన్నారు.



ఈమనిలో సీమంతం చేస్తున్న దుగ్గిరాల ఎంపీపీ సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ



మంగళగిరిలో ఆరోగ్య సురక్ష కిట్లను రోగులకు అందజేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరాజు



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు..

అంగరంగ వైభవంగా దసరా ఉత్సవాలు



113 త్యాళ్లూరులోని కాళీమాతను లలితా త్రిపురసుందరీగా దర్శనం



మోరంపూడిలో మహాలక్ష్మీ అలంకారంలో దుర్గ అమ్మవారు



గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహాలక్ష్మి అమ్మవారు



విజయకీలాద్రి పర్వతంపై సంతానలక్ష్మి అలంకారంలో అమ్మవారు



మేడికొండూరులో.. లలితా దేవి అమ్మవారికి పూజలు



పాత మంగళగిరి హైవే వెంబడి కనకదుర్గ ఆలయంలో కాశీ అన్నపూర్ణదేవి అలంకారంలో..



ధనలక్ష్మీ అలంకారంలో దర్శనమిస్తున్న కాళీమాత అమ్మవారు



తాడికొండ రామాలయం వద్ద పుష్పశయ్య అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు



మంగళగిరి శివాలయంలో ధనలక్ష్మీ అలంకారం..

తాడేపల్లిరూరల్: దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా మంగళగిరి- తాడేపల్లి కార్పొరేషన్‌తో పాటు, దుగ్గిరాల మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరులోని శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి భద్రకాళీ అలంకారం చేసి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చినవెంకటరెడ్డి ఉత్సవాలను పర్యవేక్షించారు. మోరంపూడిలో అమ్మవారి ప్రత్యేక విగ్రహానికి బుధవారం మహాలక్ష్మి అలంకారంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉండవల్లిలో...

ఉండవల్లి సెంటర్‌లో శ్రీ గణేష్‌యూత్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి మహాలక్ష్మి అలంకరణ చేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని గంగ బాలత్రిపుర సుందరీదేవి రాజరాజేశ్వరిదేవి సమేత త్రిపుర తాండవేశ్వరస్వామి ఆలయంలో వేంచేసి యున్న అమ్మవారిని మహాలక్ష్మిదేవి అలంకారం చేసి భక్తులకు దర్శనమిచ్చారు.

విజయకీలాద్రిపై.....

సీతానగరం విజయకీలాద్రిపై వేంచేసి యున్న అమ్మవారికి త్రిదండి చిన్నజీయర్ స్వామి, అహోబిల రామాను జీయర్‌స్వామి వార్ల ప్రత్యక్ష పర్యవేక్షణలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారికి సంతానలక్ష్మి అలంకారం చేసి, నవకలశ స్నపనం, తిరుమంజన సేవ, అమ్మవారికి సహస్ర నామార్చన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

లలితా దేవి అలంకరణలో అమ్మవారు..

మేడికొండూరు: దేవీ శరన్నవరాత్రులలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం అమ్మవారిని లలితాదేవిగా అలంకరించారు. మండల పరిధిలోని పేరేచర్ల, డోకిపర్రు, పాలడుగు, సిరిపురం, మేడికొండూరు, మందపాడు, కొర్రపాడు గ్రామాల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సామూహిక కుంకుమార్చనలు చేశారు. మండల కేంద్రమైన మేడికొండూరు భీమేశ్వరస్వామి వారి ఆలయంలో, సిరిపురంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో, డోకిపర్రు గ్రామంలోని పోలేరమ్మ ఆలయంలో, కార్యక్రమాలు వేద పండితుల ఆధ్వర్యంలో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్దయ్య పాల్గొన్నారు.

పుష్పశయ్య అలంకారంలో అమ్మవారు దర్శనం

తాడికొండ: దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం అమ్మవారు భక్తులకు పుష్పశయ్య అలంకారంలో దర్శనమిచ్చారు. తాడికొండ, తుళ్లూరు మండలాల్లోని పలు ఆలయాల్లో భక్తులు అమ్మవారిని వివిధ రూపాలలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో చేరి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో సందడిగా మారింది.

మంగళగిరిలో...

మంగళగిరి: నగరంలో దసరా నవరాత్రుల మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం నగరంలోని ఆలయాలలో శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారు వివిధ ఆలయాలలో వివిధ అలంకారాలలో భక్తులకు దర్శనమివ్వగా భక్తులు పెద్దసంఖ్యలో అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. నగరంలోని శ్రీలక్ష్మీనసింహ స్వామి ఆలయంలో రాజ్యలక్ష్మీ అమ్మవారు ఆదిలక్ష్మిమమ అలంకారంలో, శివాలయంలో ధనలక్ష్మీగా, పాత మంగళగిరి కనకదుర్గానగర్‌లో కాశీ అన్నపూర్ణ దేవీగా, కాళీమాత ఆలయంలో మహాలక్ష్మీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమివ్వగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

లలితా త్రిపుర సుందరిగా కాళీమాత

ఫిరంగిపురం: మండలంలోని పలుగ్రామాల్లోని దేవీ ఆలయాల్లో నవరాత్రుల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం లలితా త్రిపురసుందరీగా అలంకరించి అర్చకులు విశేష పూజలు చేశారు. మూలాంకురేశ్వరికి అర్చకులు అయ్యన్నశాస్త్రి పంచోపచారాలతో అష్టోత్తర, సహస్రనామ కుంకుమపూజలు చేశారు. ఫిరంగిపురంలో వాసవీమాతను లలితా త్రిపురసుందరిగా అలంకరించి అర్చకులు రాజేంద్రశర్మ పూజలు చేశారు. 113తాళ్లూరులోని కాళీమాతను ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు పవన్ విశేషపూజలు హోమాలు నిర్వహించారు. పూజాకార్యక్రమాలను చంటిభవానీ, సామ్రాజ్యం లు పర్యవేక్షించారు.

తెనాలి రోడ్డు విస్తరణతో మారనున్న నగర రూపురేఖలు

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు, కమిషనర్ శారదాదేవి

మంగళగిరి: తెనాలి రోడ్డు విస్తరణతో మంగళగిరి- తాడేపల్లి నగర పాలక సంస్థ రూపురేఖలు మారనున్నాయని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. తెనాలి రోడ్డు విస్తరణపై బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ కార్యాలయంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవిలతో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ గౌతమ బుద్ధా రోడ్డు విస్తరణలో నగరం ట్రాఫిక్ ఇబ్బందుల నుంచి ప్రజలు బయటపడ్డారని, తెనాలి రోడ్డు విస్తరణ పూర్తయితే నగరం ట్రాఫిక్ సమస్యల నుంచి పూర్తిగా గట్టెక్కడంతో పాటు నగర రూపురేఖలు మారుతాయని తెలిపారు. కమిషనర్ యు.శారదాదేవి మాట్లాడుతూ రానున్న రోజులలో జనాభా, వాహనాల పెరుగుదలను దృష్టిలో పెట్టుకుని రోడ్ల విస్తరణ చేపట్టడం జరుగుతుందని చెప్పారు. తెనాలి రోడ్డు విస్తరణ 2006 మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా గౌతమబుద్ధా రోడ్డు నుంచి మిద్దె సెంటర్ వరకు 40 అడుగులు, మిద్దె సెంటర్ నుంచి పెదవడ్లపూడి సెంటర్ వరకు 60 అడుగులు విస్తరించడం జరుగుతుందని పేర్కొన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని త్వరలోనే విస్తరణ పనులు చేపడతామన్నారు. తెనాలి రోడ్డు విస్తరణలో దుకాణాలు కోల్పోయే వారి కొరకు ఇప్పటికే పాతబస్టాండ్ ఆవరణలో చేనేత భవనం నిర్మాణం పూర్తి చేశామని, అర్హులైన దుకాణదారులకు చేనేత భవన సముదాయంలో దుకాణాలు కేటాయిస్తామని తెలిపారు. మిగిలిన వారికి వారు కోల్పోయిన భవనాలకు నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించడంతో పాటు టీడీఆర్ బాండ్లను అందజేయనున్నట్లు వెల్లడించారు. త్వరలోనే తెనాలి రోడ్డు విస్తరణలో స్థలాలు భవనాలు కోల్పోయే వారితో సమావేశం నిర్వహించి వారితో సమన్వయపరుచుకుని అందరికి ఆమోదయోగ్యంగా విస్తరణ పనులు చేపడతామని తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో సౌకర్యాలు..

ప్రభుత్వ ఆస్పలో ప్రజలకు వైద్యం అందించేందుకు అన్ని రకాల సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే ఆర్కే తెలిపారు. ప్రభుత్వాస్పత్రిలో మరమ్మతులకు గురయిన ఎక్సరే మిషన్‌తో పాటు ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. మార్చురీలో ఏసీ లేదని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే రూ.50 వేలు సొంత నిధులను అందజేశారు. అనంతరం లక్ష్మీనృసింహస్వామి ఆలయ రహదారిలో ఆర్చీ ఏర్పాటుకు ముందుకు వచ్చిన దాతలను అభినందించారు. కార్యక్రమంలో డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, ఏసీపీ వెంకటేశ్వర్లు, ప్రభుత్వాస్పత్రి డాక్టర్ గీతాపద్మజ, ఆర్చీ దాత టి.రామకృష్ణ, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు ఎం. మల్లేశ్వరరావు, బీజేపీ నాయకులు జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేదవాడికి వైద్యం అందించడమే లక్ష్యం

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్



లాంలో బీపీ పరీక్ష చేయించుకుంటున్న కత్తెర సురేష్ కుమార్

లాం(తాడికొండ): ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పేదవాడికి ఖరీదైన వైద్యం అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమే అని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. బుధవారం తాడికొండ మండలం లాం, తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామాలలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బృహత్తర పథకాలు దేశంలో ఎక్కడా జరిగిన దాఖలాలు లేవని, ఇతర రాష్ట్రాలు కూడా ఏపీ వైపు చూసి సంక్షేమ పథకాలు అమలు చేసే పరిస్థితులు వచ్చాయంటే జగనన్న దార్శనిక పాలన గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. గతంలో చంద్రబాబు అమలుకు నోచని హామీలతో ప్రజలను నిలువునా మోసం చేసేవాడని, నేడు అందుకు భిన్నంగా ఏపీలో జరుగుతున్న పాలన చూసి టీడీపీ ఎల్లో మీడియాతో కలిసి దుష్ప్రచారం చేయాలని బొక్క బోర్లా పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రావూరి దివ్య, మండల జేసీఎస్ కన్వీనర్ తాళ్ల శ్రీనివాసరెడ్డి, మండల ప్రత్యేకాధికారి, పరిశ్రమల శాఖ డీడీ సుధాకర్, తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్ర బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ మీరావలి, షేక్ సలీమ్, రాయపూడి రంగారావు, షేక్ మీర్జావలి పాల్గొన్నారు.

సాగునీరు అందించాలని వినతి



ప్రజా చైతన్య పాదయాత్రలో పాల్గొన్న సీపీఎం నాయకులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలంలోని హైలెవల్ చానల్ పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించి ఆదుకోవాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు అన్నారు. బుధవారం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అప్పారావు మాట్లాడుతూ దుగ్గిరాల మండలంలో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, రేవేంద్రపాడు గ్రామంలో మద్రాస్ కాలువపై ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుందని ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని అన్నారు. డ్రెయినేజీ సమస్య కారణంగా ప్రజలు డెంగీ, మలేరియా, జ్వరాల బారిన పడుతున్నారని, డ్రెయినేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తుమ్మపూడి గ్రామలో మాస్టిన్ కులం వారికి తహసీల్దార్ కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేటట్లు ప్రభుత్వం నిర్ణయం చేయాలని కోరుతున్నారు. 40 ఏళ్ల క్రితం వారి ఇళ్ల స్థలాలకు బి ఫారాలకు బదులు పర్మినెంట్ పట్టా ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, నాయకులు మన్నవ నాగమల్లేశ్వరరావు, ఎస్.యోగేశ్వరరావు, వై.బ్రహ్మేశ్వరరావు, కె.కోటయ్య, బి.అమ్మిరెడ్డి, ఏసుపాదం, పాములు పాల్గొన్నారు.